క్లుప్తంగా

నేడు జ్యోతిర్లింగ మహాపడిపూజ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు, శివ భక్తులు

కుల్కచర్ల: మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివాసంలో సోమవారం శివస్వాముల జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. శివ భక్తుల మాలధారణలో భాగంగా భక్తులు నిర్వహించే జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమాన్ని నేడు పరిగి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్నామని, పూజా కార్యక్రమానికి శివ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాండూరు రూరల్: వివిధ గ్రామాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదేశాలతో బీఆర్ఎస్ మండల నాయకులు క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, ఉమాశంకర్ ఎంపీటీసీ, నరేందర్‌రెడ్డి, సర్పంచులు రాజప్ప, రాములు, నాగర్జున, నాగప్ప, సాయిలు, మాజీ వైస్ఎంపీపీ మొగులప్ప, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాటల గారడి ప్రభుత్వం

బీజేపీ నాయకుడు పాండురంగారెడ్డి



సమావేశంలో పాల్గొన్న పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు

చేవెళ్ల: రాష్ట్రంలో దళితుల అభివృద్ధే లక్ష్యమంటూ మాయ మాటలతో ఈ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని బీజేపీ మండల అధ్యక్ష కార్యదర్శులు పాండురంగారెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డిలు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ దళితమోర్చా మండల కార్యవర్గ సమావేశంలో దళితమోర్చా మండల అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో సీఎం కేసీఆర్ మాటలు కోటలు దాటుతున్నాయి కానీ, అడుగులు గడప దాటడం లేదనే చందానా పాలన సాగుతోందని విమర్శించారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చినా ఈ పార్టీ దళితుల పేరు చెప్పుకుంటూ ముందుకు వెళ్తున్నారే కాని చేసింది ఏమీలేదన్నారు. దళితులకు భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు,, దళితబంధు ప్రతి కుటుంబానికి ఇస్తామని చెప్పిన ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదన్నారు. దళితులకు చేసింది ఏమీలేదని దళిత కుటుంబాలు కేసీఆర్ మాయ మాటలు నమ్మిమోసపోవద్దని సూచించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేవెళ్ల బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు బండారి శేఖర్‌రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీజేవైఎం జాయింట్ సెక్రటరీ బాల్‌రెడ్డి, దళిత మోర్చా మండల కమిటీ సభ్యులు రవీందర్, కుమార్, వెంకటేశ్, సాయి, రమేశ్, అనిల్, నవీన్, రామక్రిష్ణ, మల్లేశ్, ప్రభాకర్ ఉన్నారు.

ఉపాధ్యాయినికి జాతీయ పురస్కారం



పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పీర్జాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న కీర్తికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన నటరాజ కళానిలయం సంగీతం నృత్య శిక్షణ సంస్థ వారు జాతీయ పురస్కారం అందజేశారు. కీర్తి కళారంగంలో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ.. కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కలగానే ఫైర్‌స్టేషన్?

- పదేళ్లుగా ఎదురు చూపులు
- తరుచూ అగ్ని ప్రమాదాలు
- పంటలు కోల్పోతున్న రైతులు



పెద్దేముల్: 'అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని పదేళ్ల నుంచి ప్రభుత్వాన్ని కోరుతున్నా.. మా మొర ఆలకించే వారే లేరు. పండించిన పంటలు ప్రతి వేసవిలో ఎండవలనో, విద్యుత్ వైరు తగలడంతోనో.. నిప్పురవ్వ పడడంతోనే లేదా ఎవరైనా తగలబెట్టడంతోనే ఇలా పలు కారణాల వలన పంటలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అందుబాటులో ఫైర్‌స్టేషన్ లేక మా కష్టార్జితం బుగ్గిపాలవుతోంది' అని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసం వచ్చిందంటే చెరుకు, కంది పంటలు మంటల్లో కాలిపోతున్నాయని, పంటలు పోయి.. రైతులు నష్టపోతున్నా మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని బండమీదిపల్లి, తట్టెపల్లి, ఇందూరు, హన్మాపూర్, గోట్లపల్లి, పెద్దేముల్ గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం హన్మాపూర్‌లో కౌలురైతు అనంతయ్య 17ఎకరాలను కౌలుకు తీసుకొని కందిని సాగుచేశారు. పంట చేతికి వచ్చే సమయంలో కోత కోసిన తరువాత కొందరు దుండగులు నిప్పుపెట్టడంతో సుమారు మూడు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దేముల్ గ్రామంలో కౌలురైతు రాములుకు చెందిన చెరుకు పంట బూడిదై రూ. లక్ష వరకు నష్టపోయాడు. రెండేళ్లుగా బండమీదిపల్లి, తట్టెపల్లి గ్రామాల్లో సుమారు పది మంది రైతులకు చెందిన చెరుకు తోటలు నిప్పంటుకొని బుగ్గిపాలయ్యాయి.

దక్కని పరిహారం

మండలంలోని 30రెవెన్యూ గ్రామాల్లో రైతులు వంద శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నవారే. ముఖ్యంగా ఈ ప్రాంతంతో కంది, వరి, చెరుకు, మెక్కజొన్న, మినుము, పెసర పంటలతో పాటు పలు రకాల పంటలు సాగుచేస్తారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగినా.. కనీసం 30కిలో మీటర్ల దూరం నుంచి అగ్నిమాపక శకటం రావలసి ఉంటుంది. అంతలో పంట బుగ్గి పాలవుతుందని పలువురు రైతులు చెప్పారు. ఇలా నిత్యం పంటలు మంటల పాలవుతున్న నేపథ్యంలో ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు దశాబ్దకాలంగా మండల సర్వసభ్య సమావేశాలల్లో, గ్రామ సభలల్లో కోరుతున్నారు. మూడేళ్ల క్రితం మండలంలోని బండమీదిపల్లి, తట్టెపల్లి జనగాం, పెద్దేముల్‌తో పాటు పలు గ్రామాల్లో సుమారు 40 ఎకరాల వరకు చెరుకు, కంది పంటలు కాలి పోయాయి. కానీ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదని, అందుబాటులో అగ్నిమాపక కేంద్రం ఉంటే కనీసం చేతికి వచ్చిన పంటను ఘటనా సమయంలో కొంతమేరకైనా రక్షించుకునే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ముఖ్యంగా పెద్దేముల్ మండలంలో అధిక గ్రామాలు కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరిగినా.. న్యాయం జరగడం లేదని తండా వాసులు వాపోతున్నారు. దానికి తోడు పెట్టుబడులు పెరుగుతుండడంతో అప్పుల పాలవుతున్నామని, త్వరగా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్పందన కరువు



తెలంగాణ ప్రభుత్వం మండల కేంద్రాల్లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అగ్ని ప్రమాదాలు జరిగి పంటలు కాలిపోతున్నా.. సమయానికి శకటం రావడం లేదు. దీంతో పంటలు బుగ్గిపాలవుతున్నాయి. ఇదే విషయాన్ని పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో విన్నవించారు. అయినా ఇంత వరకు ఎవరూ స్పందించడం లేదు. వెంటనే పాలకులు, అధికారులు స్పందించాలి.

– శంకర్‌నాయక్, ఎంపీటీసీ, తట్టెపల్లి

శకటం వచ్చే సరికి బుగ్గే..



చెరుకు, కంది పంటలకు జనవరి, ఫిబ్రవరి మాసంలో కోతలు జరుగుతాయి. ఆ సమయంలో ఎండలు తీవ్రంగా ఉంటాయి. కరెంటు వైర్లు తగిలినా, అగ్గిరవ్వ పడినా పంటలు బూడిదవుతున్నాయి. తాండూరు నుంచి అడ్కిచెర్ల ప్రాంతానికి అగ్నిమాపక శకటం వచ్చే వరకు గంటకు పైగా సమయం పడుతుంది. అంతలో పంట మంటపాలవుతుంది. ప్రభుత్వం స్పందించి అగ్నిమాపక కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలి.

– వెంకటరెడ్డి, రైతు, అడ్కిచెర్ల

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

యాలాల: మండలంలోని దేవనూరు గ్రామంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రాం, మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాల ఏర్పాటుకు ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, సర్పంచ్ శివకుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు ఆశన్న, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు మంత్రి వెంకటయ్య, కృష్ణ, వెంకటయ్యగౌడ్, నరేశ్, ఖాసీం, సూర్యప్రకాశ్, సురేశ్ పాల్గొన్నారు.

మహాపడి పూజను విజయవంతం చేయండి

దోమ: డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి నివాసంలో సోమవారం నిర్వహించే శివ భక్తుల మహాపడి పూజకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం రాకొండ గ్రామంలో శివ భక్తులకు పూజకు సంబంధించిన కర పత్రాలను పంపిణీ చేసి ఆహ్వానించారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

కుల్కచర్ల: ముజాహిద్‌పూర్ గ్రామ పరిధిలోని వీరాంజనేయస్వామి 64వ వార్షికోత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ నేతలు చెప్పారు. 30,31 తేదీల్లో ఉత్సవం జరుగుతుందని, వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చైర్‌పర్సన్ రేసులో మేమున్నాం

బీజేపీ కౌన్సిలర్లు



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు

తాండూరు టౌన్: 'మున్సిపల్ చైర్‌పర్సన్ రేసులో మేమున్నాము'అని బీజేపీ కౌన్సిలర్లు ఉమ్మడిగా ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు.. కుర్చీ కోసం కుస్తీ పడుతున్నారని, సొంత పార్టీల కౌన్సిలర్లు పదవీ కాంక్షతో అభివృద్ధిని మరిచారని విమర్శించారు. అటు చైర్‌పర్సన్ స్వప్న, ఇటు వైస్‌చైర్‌పర్సన్ దీపలు కేవలం కుర్చీ కోసం తహతహలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గపోరుతో తాండూరు అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, అవిశ్వాస తీర్మానం పెడితే అన్ని పార్టీల కౌన్సిలర్లు బీజేపీ చైర్‌పర్సన్ అభ్యర్థికి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని భాజపా ఫ్లోర్ లీడర్ లలిత, కౌన్సిలర్లు శ్రీలత, లావణ్య, పూజ, బాలప్ప తెలిపారు. తమ ఐదుగురిలో ఎవరో ఒకరు చైర్‌పర్సన్ బరిలో నిలిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు.

నేటి నుంచి బ్రూసెల్లా వ్యాధి నివారణ టీకాలు

షాబాద్: నేటి నుంచి ఫిబ్రవరి 4 వరకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో బ్రూ సెల్లా వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని షాబాద్, రేగడిదోస్వాడ పశు వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30న షాబాద్, కుమ్మరిగూడ, కక్కులూరు, 31న బోనగిరిపల్లి, నాగర్‌కుంట, కక్కులూర్, ఫిబ్రవరి 1న మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, అంతారం, కేసారం, 2న దామర్లపల్లి, నాన్‌ధార్‌ఖాన్‌పేట్, మన్‌మర్రి, బోడంపహాడ్, 3న సాయిరెడ్డిగూడ, లింగారెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ, 4న కేశవగూడ, ముద్దెంగూడ, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామని తెలిపారు. రైతులు పశువైద్య సిబ్బందికి సహకరించి 4 నుంచి 8 నెలల లోపు లేగదూడలకు వ్యాధి నివారణ టీకాలు ఇప్పించాలని సూచించారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

పదేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం



శిథిల గోడలతో దర్శనమిస్తున్న అంగన్‌వాడీ భవనం

బంట్వారం: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా దశాబ్దకాలం క్రితం మొదలు పెట్టిన భవన నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగా మిగిలిపోయి మొండి గోడలను తలపిస్తోంది. పూర్తి కాకముందే శిథిలావస్థకు చేరుకున్న వైనం నవ్విపోదురు గాక నాకేం సిగ్గన్నట్లుగా ఉంది. మండల పరిధిలోని మద్వాపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నా.. సంబంధిత ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం స్థానిక ప్రాథమిక పాఠశాల భవనంలోనే కొనసాగుతోంది.

పదేళ్ల కిందట భవన నిర్మాణం కోసం అవసరమైన నిధులు జెడ్పీ నుంచి మంజూరయ్యాయి. అప్పట్లో పనులు చేపట్టిన గుత్తేదారు.. లెంటల్ లెవల్లోనే పనులు నిలిపి వేశారు. ఏళ్ల తరబడి పనులు పూర్తికాకపోవడంతో ఇటుక గోడల్లో పిచ్చిమొక్కలు మొలిచి.. ఏపుగా పెరుగుతున్నాయి. అయినప్పటికీ పనులు పునఃప్రారంభించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఏళ్లుగా నిర్మాణ పనులు నిలిపి వేయడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనం ఇలా వృథా కావాల్సిందేనా అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సత్వరమే తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పరిగి: శాసనసభ సమావేశాల్లో అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే మహేశ్ రెడ్డికి ఆయన నివాసంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మినీ అంగన్‌వాడీ టీచర్లను ప్రధాన టీచర్లుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉద్యోగులకు ఇస్తున్న ప్రమాద బీమా రూ.10 లక్షలు, మట్టి(అంత్యక్రియ)ఖర్చులు రూ.50 వేలు, సీనియర్లకు ప్రమోషన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. అంతేకాకుండా గ్యాస్ సరఫరా, వంట పాత్రలు, బీరువాలు, పెండింగ్ రవాణా ఖర్చులు ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో మార్చి 1,2,3 తేదీల్లో సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, అంగన్‌వాడీ ప్రాజెక్టు టీచర్ వెంకటమ్మ, పలు గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, మల్లమ్మ, పుల్లమ్మ, లక్ష్మి, లలిత, మల్లమ్మ, అరుణ, చంద్రకళ, సునీత, అనుష, కేశమ్మ, మానెమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జీవ హింస వీడాలి

ఆశ్రమ కార్యదర్శి శివయ్యస్వామి



భక్తులతో మాట్లాడుతున్న శివయ్యస్వామి

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరు జీవ హింస వీడాలని యానగొంది మాణికేశ్వరి మాత ఆశ్రమ కార్యదర్శి శివయ్యస్వామి సూచించారు. కొత్తపల్లి గ్రామంలోని మాణికేశ్వరి మాతా ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హింసను వీడి ప్రేమను పంచాలని తెలిపారు. దుఃఖానికి కారణం కోరికలని, కోరికలను అణిచివేయాలన్నారు. నిత్యం దైవ చింతనతో భగవంతుడిని స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి హరిశంకర్, గౌరవ అధ్యక్షుడు లింగారెడ్డి, అర్చకులు లింగం, ఆంజనేయులు, కోశాధికారి విశ్వంచారి, సలహాదారులు మాణిక్యం, గౌరవ అధ్యక్షుడు దారం నర్సింహులు, దారం ప్రభు, గ్రామ సర్పంచ్ శాంతచెన్నయ్య, ఎంపీటీసీ శోభాసుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



భజన మండలి అధ్యక్షుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కుల్కచర్ల: సాంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్నేహకళ భజన మండలి అధ్యక్షుడు లింగంగారి రాములు గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నూతనంగా స్నేహకళ భజన మండలి సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భజన మండలి అధ్యక్షుడిగా లింగంగారి రాములు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, ఉపాధ్యక్షుడిగా నర్సింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి కళా వైభవాన్ని, ఆచార వ్యవహారాలను భవిష్యత్ తరాలకు అందించాలన్న తపనతో భజన మండలి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉప సర్పంచ్ పాండురంగయ్య, మండలి సభ్యులు మల్లయ్య, రాములు, సాయిబాబ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ఎనలేని కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్ ముదిరాజ్



వీధి దీపాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న చైర్మన్

పరిగి: ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి సహకారంతో పరిగి పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ కార్యాలయం నుంచి దాసాంజనేయ హనుమాన్ దేవాలయం వరకు అలాగే గాంధీ చౌక్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఏర్పాటు చేస్తున్న వీధి దీపాల పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రాత్రి వేళల్లో ప్రయాణికులు, పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీధి దీపాలను అమర్చుతున్నామని చెప్పారు. పట్టణంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు మాణిక్యం, మునీర్, శ్రీశైలం, రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి, తదితరులు

షాబాద్: గ్రామీణ క్రీడాకారులకు ఆటల పోటీలు ఎంతో దోహదపడతాయని, స్నేహభావం పెంపొందుతుందని బోడంపహాడ్ గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో సహారా డిజిటల్ టోర్నమెంట్‌ను ఉమర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సరళ రాంచంద్రారెడ్డిలతో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజం అన్నారు. క్రీడలను నిజజీవితంతో భాగం చేసుకుంటే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. నాయకులు యాదిరెడ్డి, ఎండీ ఇనాయత్, భీమయ్య ఉన్నారు.

విదేశీ విహంగాల సందడి



కోట్‌పల్లి ప్రాజెక్టు ఒడ్డున నైజీరియా పక్షులు

ధారూరు: వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో విదేశీ పక్షులు క్రమంగా తెలంగాణ ప్రాంతానికి వస్తున్నాయి. ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు, గట్టెపల్లి చెరువు అటవీ సమీపంలో ఉండటంతో ఈ పక్షులు వచ్చి వాలుతున్నాయి. ముఖ్యంగా నైజీరియా పక్షులు ఎక్కువగా సందడి చేస్తున్నాయి. ప్రాజెక్టు, చెరువు ఒడ్డున వాలి కనువిందు చేస్తున్నాయి. ఏ మాత్రం అలికిడి అయినా.. అవి రివ్వున ఎగిరిపోతున్నాయి. ఈ దృశ్యాన్ని గట్టెపల్లి చెరువు వద్ద ఆదివారం 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.



అడవిలో పండ్లను సేకరిస్తున్న మహిళలు

'బలుసు' ఫలాలపై ప్రీతి

ధారూరు: అడవిలో సహజసిద్ధంగా లభించే ఇల్లింత(బలుసు) ఫలాలు అంటే స్థానిక ప్రజలకు ఎంతో ప్రీతి. అటవీ సమీప గ్రామాలు, తండాల ప్రజలు.. ఇవి కనిపిస్తే వదిలిపెట్టరు. ఏటా జనవరి, ఫిబ్రవరిలో లభించే ఈ పండ్లను సేకరించి ఇంటిల్లిపాది తింటారు. రుచితో పాటు పోషకాలు ఉండే ఈ ఫలాలు.. పిల్లల ఎదుగుదలకు దోహదపడతాయని గ్రామస్తులు చెప్పారు. మండల పరిధిలోని బూర్గుగడ్డ ప్రాంత అడవిలో ఆదివారం నాగసమందర్ గ్రామ మహిళలు ఇల్లింత పండ్లను సేకరిస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

కొనసాగుతున్న గుర్రంపల్లి జాతర

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు ఎంపీపీ యాదమ్మ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన కందూర్లకు గుర్రంపల్లి, రావిర్యాల, ఇంద్రానగర్, చౌదరిగూడ, ఎదిర తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

పాతికేళ్లకు కలిసి.. జ్ఞాపకాల ఒడిలో తడిసి



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాద్‌నగర్: పాతికేళ్ల తర్వాత బాల్యమిత్రులందరు ఒకే వేదికపై కలుసుకోవడం చెప్పలేని మధురానుభవం.. ఆదివారం పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులోని నక్షత్ర ఫంక్షన్ హాల్‌లో పద్మావతి కాలనీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల రజతోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు హాజరై తమ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠశాలల్లో చదివే రోజుల్లో చేసిన అల్లరి పనులను గుర్తుచేసుకుంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఉపాధ్యాయులు వెంకటరాఘవన్, గంగిరెడ్డి, బీపీ నర్సింహ్మారెడ్డి, శ్యామల, శివకుమారి, శారదలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వారికి మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవం పొందినప్పుడే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులందరు వారి వారి ఉన్నతిని తెలుపుతుంటే ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. గురువులు సూచించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం వివిధ రంగాల్లో కొనసాగుతూ ఆనందమైన జీవితాన్ని గడుపుతున్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు శ్యామల రాసిన కవితను విద్యార్థులకు అంకితం చేశారు.